క్లుప్తంగా

29న సీపీఐ మండల మహాసభ


మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు: చిలుకూరులోని సీపీఐ భవన్‌లో ఈ నెల 29న నిర్వహించే సీపీఐ మండల మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం చిలుకూరు సీపీఐ భవన్‌లో నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ కార్యదర్శులు సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, జిల్లా, మండల నాయకులు దొడ్డా వెంకటయ్య, చేపూరి కొండలు, తాళ్లూరి మల్లయ్య, ముక్కా లక్ష్మీనారాయణ, సాతులూరి అలివేలు, సిరాపురపు శ్రీను, బాలేబోయిన రాంబాబు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో మోదీ చిత్రపటం ఏర్పాటు చేయాలి

మఠంపల్లి: సన్నబియ్యం పంపిణీలో భాగంగా కేంద్రం నుంచి 5కేజీలు వస్తున్నందున రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటం ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటశివ కోరారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ మంగాకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సంపతి ఆదినారాయణ, పందిరి నరసింహారెడ్డి, గుండా కోటేశ్వరరావు, తుంగం వీరయ్య, స్వామినాయక్, నాగునాయక్, శివాజీనాయక్, నాగమణి, పుష్పలత, రంగానాయక్, తుల్సానాయక్, సైదానాయక్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నడిగూడెం: రాజీవ్ యువ వికాసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 14 లోపు మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజా పాలన సేవా కేంద్రంలో అందజేయాలని ఎంపీడీఓ దాసరి సంజీవయ్య గురువారం తెలిపారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 1453 మంది ఆన్‌లైన్ చేసుకోగా 622 మంది మాత్రమే కార్యాలయంలో ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


నడిగూడెం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారి వెంకటరమణ మాట్లాడుతూ రసాయనాల వ్యవసాయంతో భూసారం దెబ్బతిన్నదని, దీంతో భవిష్యత్‌లో పంటలు పండని పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పటి నుంచే రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. వ్యవసాయ భూమి లేని విద్యార్థులు తమ ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో పెరటి తోటల పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి గంటెపంగు నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బడిబాట


బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మఠంపల్లి: మండలంలోని అల్లీపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శేషిరెడ్డి ఆధ్వర్యంలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి గురువారం బడిబాట నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీఓ మృతికి సంతాపం


శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

మునగాల: మునగాల మండల పంచాయతీ అధికారి దార శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ రామారావు, మాజీ ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు పాతకొట్ల నాగరాజు, కొత్తపల్లి అంజయ్య, మండల నాయకుడు శ్రీను పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోతున్న రైతులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ఏర్పాటు చేయడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోతున్నారని హుజూర్ నగర్ బీఆర్ఎస్ నాయకులు అంజి యాదవ్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడారు.

ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే..

- పూర్తికాని మన ఊరు.. మనబడి పనులు
- అనంతగిరి మండలంలో 11 పాఠశాలల ఎంపిక
- ఇప్పటికీ రెండు పాఠశాలల్లోనే పనులు పూర్తి
- మరో తొమ్మిది పాఠశాలల్లో పనులు పెండింగ్


అసంపూర్తిగా అనంతగిరి ప్రైమరీ పాఠశాల


పాలారంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణ పనులు

అనంతగిరి: గత ప్రభుత్వం 2022లో విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు..మన బడి కార్యక్రమంలో భాగంగా అనంతగిరి మండలంలోని మొత్తం 32 పాఠశాలలకు ఏడు ప్రాథమిక, యూపీఎస్, మూడు జిల్లా పరిషత్ పాఠశాలలను ఎంపిక చేసింది. వీటిల్లో అదనపు తరగతి గదులు, ఎలక్ట్రిసిటీ, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, డైనింగ్ హాల్స్, తాగునీటి వసతి, మరమ్మతులు, ప్రహరీ, వంటగదులు, మరుమగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు పాలారం జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.22,88,279, గోండ్రియాల జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.41,10,926, శాంతినగర్ జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.67,31,614, అనంతగిరి ప్రాథమిక పాఠశాలకు రూ.47,83,010, వాయిలసింగారం ప్రాథమిక పాఠశాలకు రూ.21,49,896, ప్రాథమిక పాఠశాలకు రూ.14,15,096, అమీనాబాద్ పాఠశాలకు రూ.10,14,964, శాంతినగర్ ప్రాథమిక పాఠశాలకు రూ.8,63,670, వెంకట్రాంపురం ప్రాథమిక పాఠశాలకు రూ.8,22,738, ఖానాపురం ప్రాథమిక పాఠశాలకు రూ.29,49,154, గోండ్రియాల ప్రాథమిక పాఠశాల రూ.9,04,884 నిధులు మంజూరు చేసింది. కాగా అమీనాబాద్, గోండ్రియాలలోని ప్రాథమిక పాఠశాలలు మినహా మిగతా పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. గోండ్రియాల, అనంతగిరి, వాయిలసింగారం పాఠశాలల నూతన భవనాలు, పాలారం జెడ్పీహెచ్ఎస్‌లో డైనింగ్ హాల్ నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికాలేదు. మరోవక్క కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. నిధులు విడుదల చేస్తేనే గాని పనులు చేయలేమంటున్నారు. దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా 3 పాఠశాలల భవనాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. వంటగదులు కూడా పూర్తికాకపోవడంతో ఆరుబయటే మధ్యాహ్న భోజనం వండుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అనంతగిరి మండల వ్యాప్తంగా పనులు చేపట్టిన పాఠశాలల్లో రెండు పాఠశాలల్లో మాత్రమే పూర్తిస్థాయిలో జరిగాయి. మరో 9 పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలిగినప్పటికీ సర్దుబాటు చేసుకుంటూ వెళ్తున్నాం. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎంఈఓ తల్లాడ శ్రీనివాసరావు

చెరువుకట్టపై కంపచెట్లను తొలగిస్తాం


చెరువుకట్టను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కోదాడ: కోదాడ పెద్దచెరువు కట్టపై కంపచెట్లతో మార్నింగ్ వాకింగ్ చేసేవారికి ఇబ్బందిగా ఉందని, వాటిని తొలగించాలని పలువురు ఫిర్యాదు చేయడంతో గురువారం కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి చెరువుకట్టను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్నింగ్ వాకింగ్ కోసం వచ్చే వారికి ఇబ్బంది లేకుండా కంపచెట్లను తొలగిస్తామని చెప్పారు. విద్యుత్ దీపాలు కూడా వెలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఈదుల కృష్ణయ్య, రామినేని శ్రీనివాసరావు, బాబురావు తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మేకల శ్రీనివాసరావు

హుజూర్‌నగర్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రమాదవశాత్తు కార్మికులు చనిపోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం హుజూర్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముడుసు పాపారావు, ఉపాధ్యక్షులుగా దగ్గుపాటి సత్యానందం, భారతం చిన్న పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా కామల్ల ఆనంద్, సహాయ కార్యదర్శులుగా బండి భాస్కర్ శ్యాంసన్, కోశాధికారిగా బొప్పన రాజు, కమిటీ సభ్యులుగా వీరస్వామి, రమణ, శ్రీను, వెంకన్న, పుల్లయ్య, అచ్చయ్య ఎన్నికయ్యారు. జెట్టి ప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ ప్రాంతీయ గౌరవాధ్యక్షుడు ఇందిరాల వెంకటేశ్వర్లు, నాయకులు ముడుసు పాపారావు, నవీన్, వెంకటేశ్వర్లు, రాజు శంబిరెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి


నడిగూడెం: ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తిరుపతమ్మ

నడిగూడెం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ వేపూరి తిరుతపమ్మ కోరారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంతో పాటు, నారాయణపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో నడిగూడెం సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు, ఏపీఎం రామలక్ష్మి, సహకార సంఘం సీఈఓ కిరణ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, నాయకులు గుండు శ్రీను, దేవబత్తిని రమేష్ ప్రసాద్, దున్నా శ్రీనివాస్, వేపూరి సుధీర్, గడ్డం మల్లేష్, పసుపులేటి వినయ్‌వర్ధన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోతె: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని మోతె తహసీల్దార్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. గురువారం మోతె మండల పరిధిలోని రావిపహాడ్, అప్పన్నగూడెం, సిరికొండ, నామవరం, రాఘవాపురం, రాంపురంతండా, బుర్కచర్ల, తుమ్మగూడెం, నేరడవాయి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు సర్వారం, సిరికొండ సొసైటీ సహకారం సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ క్వింటా ధాన్యం రూ.2,320, బీ గ్రేడ్ క్వింటా ధాన్యం రూ.2,300లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిరికొండ సహకారం సంఘం చైర్మన్ కొండపల్లి వెంకటరెడ్డి, సర్వారం సహకార సంఘం చైర్మన్ ముప్పాని శ్రీధర్‌రెడ్డి, సీఓలు అనంతరెడ్డి, దోసపాటి ఉపేందర్, ఏఓ అరుణ, ఆర్ఐ రమేష్, ఏఈఓ, ఏపీఎం వెంకయ్య, సీసీలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో వైభవంగా శాంతి కల్యాణం


రామాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నేరేడుచర్ల: నేరేడుచర్లలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో గురువారం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, ఆలయ ధర్మకర్త రాచకొండ నాగమాదవ్‌ల ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, స్వామివార్లకు అభిషేకం జరిపించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాచకొండ రాంమోహన్‌రావు, కోశాధికారి టీఎస్ స్వామి, పులిజాల వెంకటరమణరావు, గోళ్ల సుధాకర్, ఈగా శ్రీనివాస్‌రావు, ఉప్పుల కృపాకర్, నాగండ్ల శ్రీధర్, యడవల్లి వెంకట్‌రెడ్డి, రాగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సైదయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, జంగయ్య, వెంకటరమణారెడ్డి, సీతారాంరెడ్డి, నారాయణరెడ్డి, అంజయ్య, చంద్రారెడ్డి, జానయ్య, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, భాస్కర్ తదితరులున్నారు.

హక్కులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే జై సంవిధాన్


నడిగూడెంలో మాట్లాడుతున్న వీరయ్య


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నడిగూడెం: రాజ్యాంగాన్ని పరిరక్షించాలని వీహెచ్‌పీఎస్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తిని వీరయ్య కోరారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన జై బాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే జై బాపు జైభీమ్ జై సంవిధాన్ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ, నడిగూడెం సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు తదితరులు పాల్గొన్నారు.

జైబాపు జైభీమ్ జై సంవిధాన్ సన్నాహక సమావేశం

అనంతగిరి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జై బాపు జైభీమ్ జై సంవిధాన్ సన్నాహక సమావేశాన్ని గురువారం అనంతగిరిలో ఆ పార్టీ గౌరవ అధ్యక్షుడు కొండపల్లి వాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ని ఉద్దేశించి పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ, రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికే జైబాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బుర్ర పుల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాణోతు బాబునాయక్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, డేగ కొండయ్య, కోటేశ్వరరావు, ధరావత్ సైదులు, కనగాల వీరయ్య, గాదె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. గురువారం గరిడేపల్లి మండలంలోని తాళ్లమల్కాపురం, సర్వారం, కుత్బుషాపురం ప్రాథమికోన్నత, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్స్, మెటీరియల్, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, కిచెన్ షెడ్స్ పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు సువర్ణ, రవీందర్‌రెడ్డి, ప్రసన్నకుమారి, గోవిందు, రాజరావు, శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, నర్సిరెడ్డి, నాగేశ్వరరావు, గోవిందు, వీరస్వామి, రంగయ్య, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

కోనాయిగూడెంలో క్షయ పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి నరేష్

గరిడేపల్లి: క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి వి. నరేష్ అన్నారు. గురువారం గరిడేపల్లి మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో క్షయ నిర్ధారణ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ అనుమానిత లక్షణాలు ఉన్న 18మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ప్రధానంగా రెండు వారాల నుంచి తెమడతో కూడిన దగ్గు, రాత్రిపూట జ్వరం రావడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పకుండా టీబీ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ఎం శారద, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, ఉపేందర్, ఏఎన్ఎం సైదమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అణచివేతకు గురిచేస్తున్న కేంద్రం


నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య, సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం చింతలపాలెంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గ్యాస్ బండలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెట్టుబడులకు, కార్పొరేట్ శక్తులకు, బడా భూస్వామ్య వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం తలవంచి ప్రజలను అణచివేతకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింతిరాల రవి, నాయకులు అంకరాజు, వీరబాబు, సత్యం, కొండలు, వెంకటరెడ్డి, శివ, రాకేష్, రమేష్, నాగిరెడ్డి, వెంకటి, శ్రీనివాస్ రెడ్డి, హైమావతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరుకల్యాణ అధ్యయనోత్సవాలు


స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారి తిరుకల్యాణ అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, విశ్వక్సేన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, గరుడ సేవ, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం బూరుగడ్డ మాచవరం గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారిని గ్రామంలోని తిరువీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ లక్ష్మణరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలక ప్రభుత్వాలు

నేరేడుచర్ల: విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వర్మ ఆరోపించారు. గురువారం నేరేడుచర్లలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు మారినా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గత నాలుగేళ్ల నుంచి రూ.4,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్, వర్షిత్, ప్రధాన కార్యదర్శులుగా పోలేబోయిన జశ్వంత్‌లతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, రాజు తదితరులున్నారు.

అనసూర్యమ్మకు నివాళి


అనసూర్యమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న యాదగిరిరావు తదితరులు

మునగాల: మండలంలోని నర్సింహులగూడెం మాజీ సర్పంచ్ జూలకంటి కొండారెడ్డి మాతృమూర్తి జూలకంటి అనసూర్యమ్మ మృతి బాధాకరమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. గురువారం ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, బచ్చలకూరి స్వరాజ్యం, సీనియర్ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, అనంతగిరి మండలం సీపీఎం కార్యదర్శి రాపోలు సూర్యనారాయణ, మండల కమిటీ సభ్యులు చందా చంద్రయ్య, స్టాలిన్ రెడ్డి, మండవ వెంకటాద్రి, సొంపంగు నర్సయ్య, తుమ్మల సతీష్, బోళ్ల కృష్ణారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా షేక్ ఖాదర్ ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

హుజూర్‌నగర్: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లో జిల్లా మహాసభల కరపత్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోదాడ నియోజకవర్గంలోని అనంతగిరి మండలం శాంతినగర్‌లో ఈనెల 12న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, కొప్పోజు సూర్యనారాయణ, జడ వెంకన్న, జక్కుల రమేష్, మామిడి వెంకయ్య, నరసయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

13న కంటి వైద్యశిబిరం

కోదాడ: పట్టణ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 13న టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో హెల్త్‌కార్డులున్న ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు హెల్త్‌కార్డులతో రావాలని, హైదరాబాద్‌లోని మెడివిజన్ కంటి వైద్యశాల వైద్యులు పరీక్షలు చేసి శస్త్రచికిత్స అవసరమైన వారికి అదే రోజు హైదరాబాద్‌లో చేసి ప్రత్యేక వాహనంలో తిరిగి ఇంటి వద్దకు చేర్చుతారని పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా తాగునీటి ట్యాంకులు


నడిగూడెం ఒకటో వార్డులో నిరుపయోగంగా ఉన్న మినీ ట్యాంకు


రెండో వార్డులో..

- మరమ్మతులకు గురైన బోరుమోటార్లు
- ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజలు

నడిగూడెం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన రెండు నీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. దీంతో ఒకటో వార్డు, రెండో వార్డు ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. బోరుమోటార్లు మరమ్మతులకు గురికావడంతో ఒకటో వార్డులో తాగునీటి ట్యాంకు గత ఆరు నెలలుగా, రెండో వార్డులో రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నాయి. ప్రస్తుతం వేసవి కావడం, భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి కోసం అల్లాడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రెండు విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

బోరుమోటారుకు మరమ్మతులు చేయించాలి



మా వాడలో దాతల సహకారంతో వాటర్ ట్యాంక్ నిర్మించారు. గత రెండు సంవత్సరాలుగా బోరు మోటారు పని చేయడం లేదు. కాలనీ వాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేయించి, నీటి సమస్య లేకుండా చూడాలి. – గంటిపంగు వీరయ్య, నడిగూడెం

పోషకాహారం తీసుకోవాలి

హుజూర్‌నగర్: గర్భిణులు, తల్లులు, పిల్లలు తగిన పోషకాహారాన్ని తీసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన పోషణ పక్షోత్సవంలో ఆమె మాట్లాడారు. గర్భిణుల్లో పోషకాహార లోపం, రక్తహీనత, తక్కువ బరువుతో జనన శిశువుల స్థాయిని తగ్గించడానికి పోషణ పక్షోత్సవం తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇందిరాల రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని వేపల సింగారంలో లబ్ధిదారులు దొండపాటి సుజాత, సోము ధనలక్ష్మి, కర్పూరపు లక్ష్మికి కల్యాణలక్ష్మి చెక్కులు, యరబోలు సైదమ్మకు రూ.60 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ కింద చెక్కులు మంజూరయ్యాయి. ఈమేరకు వీటిని గురువారం స్థానికంగా మాజీ ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి పంపిణీ చేశారు.

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని సీతారాంనగర్‌కు చెందిన పోశబోయిన రాజేష్‌కు రూ.24వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును గురువారం మంత్రి ఉత్తమ్ నివాసంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, సులువ చంద్రశేఖర్ లబ్ధిదారుడికి అందజేశారు.

మఠంపల్లి: మండలంలోకి కిందితండాకు చెందిన బానోతు హారికకు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈమేరకు గురువారం మాజీ జెడ్పీటీసీ భూక్యా నీలామంజీనాయక్ లబ్ధిదారురాలికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా నాగునాయక్ తదితరులున్నారు.

ట్రంప్ విధానాలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడాలి

గరిడేపల్లి: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న నియంత విధానాలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై అన్ని దేశాలు ఖండిస్తున్నా.. మోదీ ప్రభుత్వం మాత్రం నోరు మెదపకపోవడం ఏంటని ప్రశ్నించారు.